సాక్షి జగిత్యాల

మంగళవారం । 27 । జూన్ । 2023



మంత్రజప హోమం

రాయికల్ : శ్రీలలితాంబికాదేవి ఆలయంలో సద్గురు రామకృష్ణ ఆధ్వర్యంలో కనకధార శ్రీదేవి మంత్రజప హోమం నిర్వహించారు.



సాయిచరిత పారాయణం

జగిత్యాలటౌన్ : షిరిడీసాయి మందిరంలో ఏడురోజుల పాటు నిర్వహించే సాయినాథ చరిత పారాయణం ప్రారంభమైంది.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓటరు జాబితా సిద్ధం చేయండి



కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: సంపూర్ణ ఓటరు జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. సోమవారం ఈఆర్వో, ఏఈఆర్వోలతో జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు 18 ఏళ్ల వయసు నిండినవారందరి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాలని సూచించారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను ఎన్నికల నియమావళి మేరకు తొలగించాలని చెప్పారు. దివ్యాంగుల ఓటర్ల వివరాలు సేకరించాలని, జాబితాలో వారి పేరు నమోదు అయిందా లేదా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లత, మకరండ్, ఆర్డీవో వినోద్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కోసమే సదస్సులు



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్

మెట్‌పల్లి(కోరుట్ల): చట్టాలపై అవగాహన కల్పించడానికే న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఐక్యూ మైండ్స్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో సోమవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో మెజిస్ట్రేట్ మాట్లాడారు. యువత మంచి మార్గంలో నడిచి లక్ష్యాలను సాధించాలని సూచించారు. చట్టాలపై అవగాహన ఉంటే నేరాలు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, న్యాయవాదులు తెడ్డు ఆనంద్, వెంకటనర్సయ్య, సురక్ష, లక్ష్మణ్, గంగాధర్, కేంద్రం నిర్వాహకులు యాసిన్ పాల్గొన్నారు.

గ్రూప్–4 పరీక్షకు ఏర్పాట్లు



అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: జిల్లాలో జూలై ఒకటో తేదీన నిర్వహించే గ్రూప్–4 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ లత ఆదేశించారు. తన కార్యాలయంలో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 21,937 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉందని, వీరికోసం 73 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తామన్నారు. ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: వివిధ సమస్యలతో బాధపడుతూ పోలీసులను ఆశ్రయించే వారికి సత్వర న్యాయం అందించేందుకే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ భాస్కర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 21 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారి ఎదుటే పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. భూ సమస్యల విషయంలో అన్ని కోణాల్లో సమగ్ర విచారణ చేసి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా న్యాయం చేయాలని సూచించారు.

చదువుపై దృష్టి పెట్టండి



పుస్తకం చదివిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెడితే ఉన్నత లక్ష్యం ఛేదించవచ్చని జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి సూచించారు. పొరండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పఠనోత్సవం ప్రారంభించి మాట్లాడారు. జూలై 31వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు పఠనోత్సవం(రీడింగ్ క్యాంపైన్) చేపట్టామని తెలిపారు. ప్రతీ విద్యార్థిని పాఠశాలలో చదివించడం ద్వారా మేథాశక్తి పెంపొందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ముందుగా తమకు ఇష్టమైన కథల పుస్తకాలు మూడు భాషల్లో చదవడం అలవర్చుకోవాలని సూచించారు. సెక్టోరియల్ అధికారి రాజేశ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల ఇష్టారాజ్యం!



సోమవారం ఉదయం 10.45గంటలు : సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల కుర్చీలు ఇలా..

చర్యలు తీసుకుంటాం

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. కానీ, తెలంగాణ దశాబ్ది ఉత్సవాలతో సాధ్యం కాలేదు. ఇప్పటి నుంచి సకాలంలో విధులకు హాజరు కాకుంటే బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.
– వెంకటేశ్వర్లు, ఇరిగేషన్



డీఏవో కుర్చీ ఇలా..

ఇద్దరే హాజరు..

- సోమవారం ఉదయం 10.40గంటలకు 'సాక్షి' ఇరిగేషన్ కార్యాలయాన్ని విజిట్ చేసింది.
- ఆ సమయంలో ఇద్దరు అటెండర్లు మాత్రమే విధులకు హాజరయ్యారు.
- మిగతా సిబ్బంది ఎవరు కూడా విధులకు హాజరు కాలేదు.
- దీంతో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి.
- ఉదయం 10.50గంటలకు ఒక ఏఈ కార్యాలయానికి చేరుకున్నారు.
- మిగతా సిబ్బంది ఒక్కొక్కరుగా మధ్యాహ్నం 12గంటల వరకు ఆఫీసుకు చేరుకున్నారు.
- ఆఫీస్ బాస్ ఈఈ వెంకటేశ్వర్లు మాత్రం ఉదయం 10గంటలకే కార్యాలయానికి చేరుకున్నారు.
- ఆ తర్వాత కాసేపటికి ఎస్ఈ శ్రీనివాస్ కార్యాలయానికి చేరుకున్నారు.
- ఆయనతో కలిసి ఆఫీస్‌బాస్ క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు.
- కానీ, కింది సిబ్బంది గంట, రెండు గంటలు ఆలస్యంగా విధులకు హాజరు కావడంపై విమర్శలు వస్తున్నాయి.

- సమయపాలన పాటించని సిబ్బంది
- ఉదయం 11గంటలైనా విధులకు హాజరుకాని వైనం
- తెలిసినా చర్యలు తీసుకోని అధికారులు
- నీటి పారుదల శాఖలో దుస్థితి ఇది



ఖాళీగా కనిపిస్తున్న కంప్యూటర్ సిబ్బంది కుర్చీలు

మెట్‌పల్లి(కోరుట్ల): స్థానిక ఎస్సారెస్పీ క్యాంపులోని నీటి పారుదల శాఖ డివిజన్–2 కార్యాలయంలో సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. విధుల నిర్వహణ విషయంలో ఏమాత్రం సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా మారింది. ప్రతీరోజు ఉన్నతాధికారుల కళ్లెదుటే ఇలా జరుగుతున్నా పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు..

కార్యాలయంలో ఈఈతోపాటు ఇద్దరు డీఈలు, ఐదుగురు ఏఈలు, సూపరింటెండెంట్, డీఏవో, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, మరో నలుగురు సీనియర్ అసిస్టెంట్లు, ఒక టైపిస్ట్, ఇద్దరు అటెండర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో కార్యాలయానికే పరిమితమై విధులు నిర్వహించే సిబ్బందిలో ఎక్కువ మంది ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. సూపరింటెండెంట్ కరీంనగర్ నుంచి, డీఏవో జగిత్యాల నుంచి, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లలో ఒకరు నిజామాబాద్ నుంచి, మరొకరు కోరుట్ల నుంచి, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లలో ఒకరు కమ్మర్‌పల్లి నుంచి, మరొకరు నిజామాబాద్ నుంచి, అటెండర్లలో ఒకరు కోరుట్ల నుంచి, ఇంకొకరు పోచంపాడు నుంచి వచ్చి విధులకు హాజరై ఆ తర్వాత ఇళ్లకు వెళ్తున్నారు.

ఉదయం 10గంటలకే రావాల్సి ఉన్నా..

- నిబంధనల ప్రకారం ప్రతీరోజు ఉదయం 10గంటలకు విధులకు హాజరై తిరిగి సాయంత్రం 5గంటలకు విధులు ముగించుకుని వెళ్లాల్సి ఉంటుంది.
- కానీ, ఉద్యోగులు, సిబ్బంది ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో గంట, రెండు గంటలు ఆలస్యంగా విధులకు హాజరు కావడం, పనివేళలకు ముందుగానే ఇళ్లకు వెళ్లిపోవడం చేస్తున్నారు.
- స్థానికంగా నివాసం ఉంటున్న ఉద్యోగులు కూడా వీరినే అనుసరిస్తున్నారు.
- వీరితోపాటు ఇంజినీరింగ్ సిబ్బందిలో కొందరు ఫీల్డ్ విజిట్ పేరుతో రోజుల తరబడి విధులకు డుమ్మా కొడుతున్నట్లు తెలిసింది.

చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు..

- ఈఈగా ఉన్న వెంకటేశ్వర్లు స్థానికంగానే నివాసం ఉంటున్నారు. ఆయన ప్రతీరోజు విధులకు సక్రమంగానే హాజరవుతున్నారు. కానీ, కిందస్థాయి సిబ్బంది సమయపాలన పాటించడంలేదు. అయినా, వారిపై తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నేడు వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్‌ఇన్



జగిత్యాలఅగ్రికల్చర్: వర్షాకాలం ఆరంభమైంది. అదను దాటుతున్నా చినుకు జాడలేదు. నేలలో పదన లేదు. విత్తనాలు వేయాలా? వద్దా? అనే సంశయంలో అన్నదాతలు ఉన్నారు. జిల్లాలోని కొన్నిచోట్ల చిరుజల్లులు కురవడంతో విత్తనాలు చల్లిన రైతులు.. వానదేవుని కరుణ కోసం పూజలు చేస్తున్నారు. ఈ సమయంలో రైతులు ఏం చేయాలి? ఎప్పటివరకు విత్తనాలు వేసుకోవాలి? వర్షాలు ఆలస్యమైతే ఏ పంట మంచిది? అదనులో విత్తనాలు వేయకుంటే పంటలు ఏ మేరకు దెబ్బతింటాయనే తదితర విషయాల గురించి ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనుల గురించి చర్చించేందుకు సాక్షి దినపత్రిక.. జిల్లా వ్యవసాయాధికారి పి.సురేశ్‌కుమార్‌తో మంగళవారం ఫోన్‌ఇన్ కార్యక్రమం ఏర్పాటు చేసింది. కింద చూపిన ఫోన్ నంబరుకు కాల్‌చేసి రైతులు తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం : జూన్ 27(మంగళవారం)

సమయం : ఉదయం 10 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నంబరు : 72888 94119

సారూ.. స్పందించండి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మకరండ్



ఫిర్యాదు చేస్తున్న చలగల్ రైతులు

- సమస్యలు పరిష్కరించండి
- ప్రజావాణికి బాధితుల విన్నపం

జగిత్యాలటౌన్: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అభాగ్యులు వివిధ సమస్యలపై 45 దరఖాస్తులు సమర్పించారు. అర్జీలు స్వీకరించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మకరండ్.. ప్రజావాణి ద్వారా స్వీకరించిన అర్జీలకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి తక్షణమే పరిష్కరించాలన్నారు.

ధాన్యం డబ్బుల్లో కోత..

ధాన్యం కొనుగోలు సమయంలో తూకంలో రైతులను నిర్వాహకులు మోసం చేశారని, బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జయచేయడంలో మరోసారి దగా చేశారని బీజేపీ నాయకుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో చల్‌గల్ రైతులు ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. రైతులకు ఇచ్చిన తక్‌పట్టీ లెక్కకు, అకౌంట్లలో జమైన సొమ్ములో చాలా వ్యత్యాసం ఉందని, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బకాయిలు ఇప్పించండి..

ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రజావాణి ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫీజుల కోసం ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని ఆరోపించారు. పైసలు ఇవ్వనిదే సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని, దీంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

చర్యలు తీసుకోండి..

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జిల్లా వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని జగిత్యాల మున్సిపల్ 47వ వార్డుకు చెందిన కోటగిరి మోహన్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై స్పందించడంలేదని, ఆఫీసులో అందుబాటులో ఉండడం లేదని, ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయరని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైద్యాధికారిని బదిలీ చేసి వైద్య సేవలు మెరుగుపరచాలని మోహన్ కోరారు.

వంశీ హంతకులను శిక్షించాలని ధర్నా



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన యువకుడు జువ్వికింది వంశీని హత్య చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామస్తులతో కలిసి గ్రామంలోని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బీర్‌పూర్ గ్రామానికి చెందిన జువ్వికింది వంశీని తుంగూర్ గ్రామ ప్రధాన రహదారిపై ఆదివారం పట్టపగలు గొడ్డలి, ఇతర ఆయుధాలతో దారుణంగా హత్య చేశారని తెలిపారు. రాత్రి కావడంతో వంశీ మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం పూర్తిచేశారు. మృతదేహాన్ని బీర్‌పూర్ తీసుకొచ్చిన బాధిత కుటుంబసభ్యులు.. ఆ మృతదేహాన్ని రోడ్డుపై వేసి ధర్నా చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులకు బీర్‌పూర్ గ్రామస్తులు సంఘీభావం తెలిపారు. సమాచారం అందుకున్న జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్, రాయికల్ ఎస్సై అజయ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితులు రమేశ్, విష్ణుపై హత్యానేరం, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. దీంతో వంశీ కుటుంబ సభ్యులు ధర్నా విరమించారు. కాగా, మృతుడి తండ్రి శ్రీ హరి ముంబయి నుంచి రాగానే సాయంత్రం అంత్యక్రియలను పూర్తిచేశారు.

మత్తుకు బానిసలు కావొద్దు

- జిల్లా సంక్షేమాధికారి నరేశ్
- ఘనంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీలో అధికారులు

జగిత్యాలటౌన్: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ సూచించారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. తొలుత పట్టణంలోని వివేకానంద మినీస్టేడియం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నరేశ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం యువత జీవితాలను అంధకారం చేస్తుందన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండి తమ జీవిత లక్ష్యంవైపు ప్రయాణం సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీధర్, డీఎస్పీ ప్రకాశ్, డీఎస్‌డీవో రాజ్‌కుమార్, డీసీపీవో హరీశ్, జిల్లా అంబుడ్స్‌మన్ కృష్ణారెడ్డి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిఅశోక్‌కుమార్, సామాజిక కార్యకర్త తవుటు రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బంద్



నిరసన తెలుతున్న నాయకులు

జగిత్యాల: కనీస మౌలిక వసతులు కల్పించాలని, ఫీజు దోపిడీ అరికట్టాలనే డిమాండ్‌తో ఏబీవీపీ నాయకులు సోమవారం ఇచ్చిన బంద్ పిలుపు ప్రశాంతంగా ముగిసింది. నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలకు వెంటనే పూర్తిస్థాయిలో పుస్తకాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో డొనేషన్ల పేరిట అత్యధికంగా ఫీజు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లో తొలకరి!

- పార్టీ పునరుజ్జీవంపై కేడర్‌లో చిగురించిన ఆశలు
- ఉమ్మడి జిల్లాలో ఊపందుకుంటున్న కార్యకలాపాలు
- కర్ణాటక తరహాలో 50 శాతం బీసీలకు సీట్లపై అభ్యర్థుల ఆశలు
- అభ్యర్థుల బలాబలాలపై సర్వే ప్రారంభించిన పార్టీ
- అవసరమైతే..థర్డ్‌పార్టీ సర్వేకు సైతం సిద్ధం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: బీడుబారిన భూమిలా నిర్జీవంగా ఉన్న ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీలో కర్ణాటక ఫలితాలు తొలకరిలా ఆశలు రేపుతున్నాయి. దాదాపు దశాబ్దకాలంగా అధికారానికి దూరంగా ఉన్న పార్టీలో మొన్నటి కర్ణాటక అసెంబ్లీ ఫలితాలు ఉత్తేజాన్నిస్తున్నాయి. జాకీలు పెట్టినా పార్టీ లేవదని ఇంతకాలం ప్రకటనలు ఇచ్చిన లీడర్లు ఇప్పుడు సానుకూల ప్రకటనలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న టైంలో జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు వరుస ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. కేడర్ కూడా కొత్త ఉత్సాహంతో పనిచేస్తుండటం పార్టీకి కలిసి వచ్చే అంశంగా నాయకులు భావిస్తున్నారు. ఇదే సమయంలో ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు ఆధ్వర్యంలో జిల్లాలో రహస్యంగా సర్వే చేస్తున్నారు. సర్వే ఆధారంగానే ఎన్నికల్లో అభ్యర్థులకు టికెట్లు ఉంటాయన్న భావనతో నేతలంతా పార్టీ కార్యక్రమాల్లో రెట్టించిన ఉత్సాహంతో పాల్గొంటున్నారు.

50 శాతంపై రిజర్వేషన్‌పై ఆశ

రాష్ట్రంలో మొత్తం 119 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. కర్ణాటకలో వ్యూహాన్ని ఇక్కడా అమలు చేయాలని పార్టీ ఆలోచిస్తున్న తరుణంలో బీసీ నేతలంతా తమ బలబలాలను అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 119లో 31 స్థానాలు రిజర్వేషన్లు పోను, 88 స్థానాలు ఉంటాయి. అందులో పాతబస్తీలో ఏడు స్థానాలు ముస్లింలే పోటీచేస్తారు కాబట్టి.. మిగిలిన స్థానాలు 81 మాత్రమే. ఇందులో 50 శాతం బీసీలకు సీట్లు కేటాయిస్తారని బీసీ నేతలంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో ప్రతీ పార్లమెంటు సెగ్మెంటు పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు బీసీలకు కేటాయిస్తారన్న ప్రచారంపైనా అభ్యర్థులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఈ లెక్కన చూసుకున్నా.. ఎంతలేదన్నా బీసీలకు 34 సీట్లు వస్తాయని ధీమాతో ఉన్నారు. ఈ కోవలో ఉమ్మడి జిల్లాలోని మూడు పార్లమెంటు సెగ్మెంటు పరిధిలో తమకు ఎంత లేదన్నా నాలుగు నుంచి ఐదు స్థానాలు తప్పకుండా వస్తాయని నమ్మకంగా ఉన్నారు.

సర్వే మొదలు

2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఉమ్మడి జిల్లాలో పార్టీ ప్రభ క్రమంగా మసకబారుతోంది. 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కరీంనగర్ నుంచి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి జి.వివేక్, నిజామాబాద్ పార్లమెంటు నుంచి మధుయాష్కీ ఎంపీలుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు. కానీ.. అసెంబ్లీ విషయానికి వచ్చేసరికి మహాకూటమి కారణంగా కేవలం మానకొండూరు, హుస్నాబాద్, మంథని మూడు అసెంబ్లీ స్థానాలకు పరిమితమైంది. తర్వాత 2014లో జగిత్యాల జీవన్‌రెడ్డి, 2018లో మంథని నుంచి శ్రీధర్‌బాబు, రామగుండం నుంచి కోరుకంటి చందర్ (ఏఐఎఫ్‌బీ) మినహా మిగిలిన స్థానాలన్నీ బీఆర్ఎస్ ఎగరేసుకుపోయింది. అందుకే, ఈసారి అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ పకడ్బందీగా వ్యవహరిస్తోంది. సునీల్ కనుగోలు టీమ్‌లు 13 నియోజకవర్గాల్లో రహస్యంగా పర్యటిస్తున్నాయి. ఈసర్వే ఆధారంగానే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టికెట్లు కేటాయించనుంది. ఎక్కడైనా సర్వే నుంచి స్పష్టమైన వివరాలు రాకపోతే థర్డ్ పార్టీకి వెళ్లనుందని సమాచారం.

చేరికలపై ఊహాగానాలు..

కరీంనగర్ జిల్లాలో పలువురు బడా నేతలు పార్టీలో చేరతారన్న ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పార్టీలోకి వస్తారని మీడియాలో జోరుగా ప్రచారం సాగుతున్నా.. ఆయన నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవడం గమనార్హం. జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, గ్రానైట్ వ్యాపారి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. అదే సమయంలో ఓ జెడ్పీటీసీ కూడా ఇదే ప్రయత్నాల్లో ఉన్నారు. వీరిద్దరూ తరచూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి కరీంనగర్ అసెంబ్లీ టికెట్ కోరినట్లు సమాచారం. మొత్తానికి ఎన్నికల ముందు తమ పార్టీ బలోపేతమవుతోందని కేడర్ భావిస్తోంది.

నియోజకవర్గాల వారీగా...

కరీంనగర్, పెద్దపల్లి మినహా ఏ అసెంబ్లీ స్థానాల్లోనూ అభ్యర్థుల మధ్య ఎలాంటి పోటీ లేకపోవడం ఆ పార్టీకి కలిసి వచ్చే అంశంగా కనిపిస్తోంది.

- వేములవాడలో ఆది శ్రీనివాస్ వరుసగా ఓటమిపాలైనా తన చిరకాల ప్రత్యర్థి చెన్నమనేని రమేశ్‌పై పోరాటం సాగిస్తూనే ఉన్నారు. వేములవాడ ఆలయం, స్థానిక సమస్యలపై ప్రతీరోజూ వివిధ కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. సిరిసిల్లలో కేకే మహేందర్‌రెడ్డి ఈసారి ఎలాగైనా తన సత్తా చాటాలని చూస్తున్నారు.
- మానకొండూరు నుంచి ఇప్పటికే మూడుసార్లు పోటీ చేసిన కవ్వంపల్లి సత్యనారాయణ కొంత కాలంగా ఉత్సాహంగా దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరికలతో కేడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది.
- హుజూరాబాద్‌లో బల్మూరి వెంకట్ కూడా క్రియాశీలకంగానే ఉన్నారు.
- హుస్నాబాద్ నుంచి మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తిరిగి పార్టీలో చేరి, ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.
- చొప్పదండి నుంచి మేడిపల్లి సత్యం ప్రభుత్వానికి వ్యతిరేకంగా వరుస ఆందోళనలు నిర్వహిస్తున్నారు.
- కరీంనగర్‌లో పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రోహిత్‌రావులు టికెట్ ఆశిస్తుండగా..వీరిలో ఒకరికి సర్వే ఆధారంగా టికెట్ కేటాయించే అవకాశాలున్నాయని నేతలు అభిప్రాయపడుతున్నారు.
- జగిత్యాల నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రోజూ ప్రెస్‌మీట్లు, సమావేశాలతో బిజీగా ఉంటున్నారు.
- కోరుట్ల నుంచి జువ్వాడి నర్సింగరావు మరోసారి బరిలోకి దిగనున్నారు.
- ధర్మపురి నుంచి అడ్లూరి లక్ష్మణ్ ఈసారి ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఉన్నారు. క్రితంసారి తన ఎన్నికపై న్యాయపోరాటం చేస్తున్న ఆయన ఈసారి ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం సాధిస్తానన్న ధీమాతో ఉన్నారు.
- పెద్దపల్లి నుంచి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు పేరును గతంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ ప్రకటించారు. కానీ.. బీసీ కోటా కింత జెడ్పీటీసీ ఘంటా రాములు, డీసీసీ మాజీ అధ్యక్షుడు ఈర్ల కొమురయ్యలు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు.
- మంథని నుంచి శ్రీధర్‌బాబు మరోసారి విజయంపై నమ్మకంగా ఉన్నారు.
- రామగుండం నుంచి ఈసారి గెలిచి తీరాలని మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పట్టుదలగా ఉన్నారు.

క్లుప్తంగా

మహిళా కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా సుప్రియ



కొండగట్టు(చొప్పదండి): మహిళా కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా కొడిమ్యాలకు చెందిన 5వ వార్డు సభ్యురాలు ఎడుమల సుప్రియను నియమించినట్లు మహిళా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమెకు నియామకపత్రం అందించారు. సుప్రియ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, తనపై నమ్మకం ఉంచి, నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపెల్లి సత్యం, మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలలకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్ అందిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: పాఠశాలలు, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు ప్రభుత్వం జిల్లాకు 543 ట్యాబ్‌లను సరఫరా చేసినట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. రెండు విడతలుగా జిల్లాలో ఎంపిక చేసిన పీఎస్, యూపీఎస్ పాఠశాలలకు వాటిని పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం పలు స్కూళ్లకు అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, సంజీవ్, దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

నాగరాజుకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న నాగరాజు

కోరుట్ల: పట్టణానికి చెందిన కోరుట్ల సేవాదళ్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ పురస్కారం అందుకున్నారు. ఆంధ్రాలోని గుంటూరులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు చందు సాంబశివరావు, గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత వంగల శాంతికృష్ణ ఆయనకు పురస్కారం అందజేశారు. నాగరాజు నిర్వహిస్తున్న అన్నం పరబ్రహ్మ స్వరూపం, సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేశారు. ఆయనను పలువురు అభినందించారు.

ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్



సురేశ్

పెగడపల్లి(ధర్మపురి)/కొండగట్టు(చొప్పదండి): మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, కొడిమ్యాల మండలంలోని పూడూర్‌కు చెందిన ఆరెపల్లి కుంట సురేశ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ఆంగ్ల సాహిత్యంలో సోమవారం డాక్టరేట్ ప్రకటించింది. నేషన్, హిస్టరీ అండ్ ఐడెంటిటీ, స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ ఇండియన్ నావెల్స్ ఇన్ ఇంగ్లిష్ అనే అంశంపై ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరిశోధన చేశాడు. పోస్ కలోనియల్ థీమ్ ఆధారంగా దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక తదితర అంశాలే ఇతివృత్తంగా సాగిన నవలలే దీనికి ప్రధాన అంశమని పేర్కొన్నాడు. తన పరిశోధనకు సహకారం అందించిన ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

లబ్ధిదారుల ఎంపికపై ఉత్కంఠ

- రూ.లక్ష ఆర్థికసాయానికి జిల్లాలో 17,227 అర్జీలు
- ముగిసిన అధికారుల విచారణ, దరఖాస్తుల పరిశీలన



అర్జీలు పరిశీలిస్తున్న ఎంపీడీవో నవీన్‌కుమార్

గొల్లపల్లి(ధర్మపురి): బీసీ సామాజిక వర్గంలోని 14 కులవృత్తులతోపాటు ఎంబీసీలకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందించేందుకు ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. జగిత్యాల జిల్లాలో మొత్తం 17,227 అర్జీలు వచ్చాయి. ప్రస్తుతం వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రాజకీయాలకతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

380 గ్రామ పంచాయతీలు..

జిల్లాలో 380 గ్రామ పంచాయతీలున్నాయి. 17227 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 15,200 మంది సంబంధిత పత్రాలను ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేశారు. వాటిని అందజేసేందుకు గడువు ఈ నెల 26తో ముగిసింది. అర్జీలను స్వీకరించిన అధికారులు వాటిని సోమవారం వరకు పరిశీలించారు.

ఎంపికకు మార్గదర్శకాలు..

లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో ఎంపీడీవో ఆధ్వర్యంలో కమిటీ వేసి, బీసీ సంక్షేమ శాఖకు దరఖాస్తులను పంపించనున్నారు. చేతివృత్తుల వారితోపాటు సంచార జాతుల వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సర్కారు పేర్కొంది. స్థానికంగా ఉంటూ నిరుపేదలైన వారిని ప్రత్యేకంగా గుర్తించి, రూ.లక్ష సాయం అందించాలని సూచించింది. 14 కులాలతోపాటు, ఎంబీసీల్లో దివ్యాంగులు, ఒంటరి మహిళలు, నిరుద్యోగ యువతకూ అవకాశం ఇవ్వాలని, రూ.2 లక్షలలోపు ఆదాయం ఉండాలని చెప్పింది. దరఖాస్తు చేసుకున్న వారిలో ఎక్కువ మందికి ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని అధికారులు అంటున్నారు.

> **ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..**
>
> దరఖాస్తుల పరిశీలన ఈ నెల 26తో ముగిసింది. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు వివరాలు సేకరించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడుతాం.
>
> – ఎంపీడీవో నవీన్‌కుమార్, గొల్లపల్లి

తనయుడి చేతిలో తండ్రి హతం

- కొడుకు, కోడలు గొడవ పడుతుంటే అడ్డువెళ్లిన పర్శరాములు
- తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మృతి
- మృతుడు భూషణరావుపేట పీఏసీఎస్ డైరెక్టర్



పర్శరాములు నాయక్ (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): కుమారుడు తాగిన మైకంలో కోడలిని కొడుతుంటే ఆ తండ్రి అడ్డు వెళ్లాడు. దీంతో కోపోద్రిక్తుడైన కొడుకు కన్నతండ్రిని హతమార్చిన ఘటన కథలాపూర్ మండలంలోని ఇప్పపెల్లి గిరిజన తండాలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ పర్శరాములు నాయక్(65) భూషణరావుపేట పీఏసీఎస్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పర్శరాములు నాయక్–బిక్కిబాయి దంపతులు తమ చిన్న కుమారుడు పరమేశ్ నాయక్‌తో ఉంటారు. ఈ నెల 23న రాత్రి పరమేశ్ నాయక్ మద్యం తాగి వచ్చి, తన భార్య ప్రమీలను కర్రతో కొడుతుంటే అక్కడే ఉన్న పర్శరాములునాయక్ అడ్డుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన అతను అదే కర్రతో తండ్రిపై దాడి చేశాడు. ఈ సంఘటనలో ప్రమీల చేతి విరగగా, పర్శరాములు నాయక్ తీవ్రంగా గాయపడి, స్పృహతప్పి పడిపోయారు. కుటుంబసభ్యులు వెంటనే వారిని కోరుట్ల పట్టణంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పర్శరాములు నాయక్ సోమవారం ఉదయం మృతిచెందారు. సంఘటన స్థలాన్ని కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్ పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతుడి భార్య బిక్కిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పర్శరాములు నాయక్ మృతదేహానికి మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, సహకార సంఘం సీఈవో అరుణ్, డైరెక్టర్లు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

దుబ్బాక ప్రభుత్వాస్పత్రిలో అరుదైన ఆపరేషన్

- మహిళ కడుపు నుంచి ఐదు కిలోల గడ్డ తొలగింపు



భవానితో దుబ్బాక ఆస్పత్రి వైద్య బృందం

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వాస్పత్రిలో మరో అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. జగిత్యాల జిల్లాకు చెందిన మహిళకు సర్జరీ చేసి ఆమె కడుపులో నుంచి 5 కిలోలకుపైగా బరువు ఉన్న రెండు ఫైబ్రైడ్ గడ్డలను వైద్యులు తొలగించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాకు చెందిన భవాని కడుపునొప్పితో వివిధ ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. వారంరోజుల క్రితం తమ బంధువులతో సమాచారం తెలుసుకొని దుబ్బాక ఆస్పత్రికి వచ్చింది. భవానికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. ఆమె కడుపులో గడ్డలు ఉన్నట్టు గుర్తించారు. ఈ క్రమంలోనే ఆమెకు సోమవారం డాక్టర్ హేమరాజుసింగ్ ఆపరేషన్ నిర్వహించి కడుపులోంచి గడ్డలు తొలగించారు. ప్రస్తుతం భవాని ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

బండలింగాపూర్.. ఇక మండలం

మెట్‌పల్లి(కోరుట్ల): మేజర్ గ్రామ పంచాయతీ బండలింగాపూర్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసింది. రాజేశ్వర్‌రావుపేట, మేడిపల్లి, రాంచంద్రంపేట, విట్టంపేట, మెట్లచిట్టాపూర్, జగ్గాసాగర్, రాంలచ్చక్కపేట, రంగారావుపేట, ఆత్మకూర్ రెవెన్యూ గ్రామాలతో కలిపి బండలింగాపూర్‌ను కొత్త మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేశారు. దీనిపై 15రోజుల్లోగా కలెక్టర్‌కు అభ్యంతరాలు, వినతులను రాత పూర్వకంగా అందజేయాలని సూచించారు. మరోవైపు జగ్గాసాగర్‌ను కూడా మండలంగా ప్రకటించాలని ఆ గ్రామస్తులు గతంలో పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. దానిని కూడా మండలం చేస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ప్రస్తుతం ఆ గ్రామాన్ని కొత్త మండలంలో చేర్చుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనిని జగ్గాసాగర్ గ్రామస్తులు వ్యతిరేకించే అవకాశముంది.

‘బీఆర్‌ఎస్ మునిగిపోయే నావ’



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: బీఆర్‌ఎస్ పార్టీ మునిగిపోయే నావ లాంటిదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం స్థానిక ఇందిరాభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముదిరాజ్ సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై రాష్ట్రంలో దుమారం రేగుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. కౌశిక్ వివాదంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న స్పందన అభినందనీయమన్నారు. బీసీ యువతకు ఉపాధి కల్పించే యాక్షన్ ప్లాన్ ఊసేలేదని విమర్శించారు. బీసీ రిజర్వేషన్‌ను 40శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, జున్ను రాజేందర్, మన్సూర్, గుండ మధు పాల్గొన్నారు.

అటవీ సంపదను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- విజిలెన్స్ పీసీసీఎఫ్ ఏలుసింగ్



మొక్క నాటి, నీరు పోస్తున్న విజిలెన్స్ పీసీసీఎఫ్ ఏలుసింగ్

రాయికల్(జగిత్యాల): అటవీ సంపదను రక్షించడంలో అటవీశాఖ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ పీసీసీఎఫ్ ఏలుసింగ్ హెచ్చరించారు. సోమవారం రాయికల్‌లోని చింతలూరు సెక్షన్‌లో అడవుల పునరుద్ధరణలో భాగంగా పనులను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటి, మాట్లాడారు. అడవుల రక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. మొక్కల పెంపకం, అటవీ జంతువుల సంరక్షణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీసీఎఫ్ బాసర, డీఎఫ్‌వో వెంకటేశ్వర్లు, ఎఫ్‌ఆర్వో భూమేశ్, డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ చంద్రమౌళి, సెక్షన్ ఆఫీసర్ విజయ్‌కుమార్, మల్లన్న పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండలం పోరుమల్ల, గూండ్లపల్లి గ్రామాల్లోని రెండు దేవాలయాల్లో ఆదివారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. పోరమల్ల శివాలయంలోని హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. అందులో రూ.20వేల నగదు ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గూండ్లపల్లి పెద్దమ్మతల్లి ఆలయంలో దేవత పుస్తెలు, మట్టెలు అపహరించారు. రెండు దేవాలయాల్లో దొంగతనం జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు సంఘటన స్థలాలను పరిశీలించారు.

జువ్వాడి కుటుంబానికి పరామర్శ

ధర్మపురి: మాజీ మంత్రి, దివంగత జువ్వాడి రత్నాకర్‌రావు సతీమణి సుమతీదేవి ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు సోమవారం పరామర్శించారు. ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం సుమతీదేవి దశదిన కర్మ సందర్భంగా వారి నివాసానికి చేరుకొని, ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. రత్నాకర్‌రావు కుమారులు నర్సింగరావు, నవనీతకృష్ణారావు, చంద్రశేఖర్‌రావులను ఓదార్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో కత్తితో నృత్యం.. ఇద్దరికి గాయాలు

కోరుట్ల: పెద్దమ్మ జాతరలో కత్తితో ఓ యువకుడు నృత్యం చేయగా ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. ఆయన వివరాలు ప్రకారం.. ఆదివారం సాయంత్రం కోరుట్లలో పెద్దమ్మ జాతర సందర్భంగా యువకులు నృత్యం చేస్తున్నారు. ఆ సమయంలో గెల్లె వినోద్ చిన్న కత్తి పట్టుకొని, డ్యాన్స్ చేశాడు. దీంతో అది పక్కనే ఉన్న రాజేందర్, శివ అనే యువకులకు తగలగా ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

జగిత్యాలరూరల్: అంతర్గాం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అజయ్‌బాబు సోమవారం తెలిపారు. ఈనెల 24న జరిగిన జిల్లాస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో అదరవేని సాహితి, అల్లెపు పూజ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈనెల 30 నుంచి జూలై 2వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వారు హాజరవుతారని పేర్కొన్నారు. సాహితి, పూజను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, సర్పంచ్ బోనగిరి నారాయణ, ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు సునీల్‌కుమార్ సోమవారం అభినందించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): మండలంలోని ఖిలావనపర్తి శివారు వ్యవసాయ బావిలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అశ్విని తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. జూలపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన సిద్దిఖాబేగం(68)కు మూడు పెళ్లిళ్లయ్యాయి. వివిధ కారణాలతో ఆమె విడాకులు తీసుకుంది. ఒక కూతురు సంతానం కాగా కానంపెల్లికి చెందిన వ్యక్తికి ఇచ్చి, వివాహం జరిపించింది. ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్న ఆమె అప్పుడప్పుడు కూతురు ఇంటికి వస్తూ పోతుంటుంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, సోమవారం బావిలో దూకింది. మృతురాలి కూతురు షేక్ షమీమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సేవాతత్పరుడు గొల్లపెల్లి గణేశ్



పేద విద్యార్థినులకు డీఈవో జగన్మోహన్‌రెడ్డి చేతులమీదుగా సామగ్రి పంపిణీ (ఫైల్)

- దత్తత సంస్థతో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు
- ఇప్పటివరకు 2,500 మందికి రూ.15 లక్షల విద్యా సామగ్రి అందజేత
- ఆదర్శం.. దివ్యాంగ ఉపాధ్యాయుడు

ధర్మపురి: దిక్కులేని వారికి దేవుడే దిక్కై న‌ట్లు తల్లిదండ్రులు లేని, చదువుకోలేని నిరుపేద విద్యార్థులకు తనవంతు సాయం చేస్తూ వారి జీవితాల్లో వెలుగు నింపుతున్నాడు.. దివ్యాంగుడైనా వృత్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి సేవాభావంగా ముందుకుసాగుతున్నాడు ధర్మపురికి చెందిన గొల్లపెల్లి గణేశ్. తెలుగు పండిట్‌గా పని చేస్తున్న ఆయన సేవలపై ప్రత్యేక కథనం.

2015లో సంస్థ ప్రారంభం..

గణేశ్ 2015లో విద్యార్థి దత్తత అనే సంస్థను ఏర్పాటు చేశారు. దీనికి ధర్మపురి మిత్ర బృందంతోపాటు ఎన్నారైలు సహాయ సహకారాలు అందిస్తున్నారు. విద్యార్థులకు సంవత్సరానికి సరిపడా నోటు బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు, బ్యాగులు అందిస్తున్నారు. ఇప్పటివరకు ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్ మండలాలకు చెందిన 2,500 మంది నిరుపేద విద్యార్థులకు రూ.15 లక్షల విలువైన విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

ఏడుగురు విద్యార్థినుల దత్తత..

ఉన్నత చదువులు చదవడానికి ఆర్థిక స్థోమత లేని, తల్లిదండ్రులు లేని, పేద కుటుంబాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులను ఈ సంస్థ ద్వారా దత్తత తీసుకున్నారు. వీరిలో ఎండపెల్లికి చెందిన మాధవి పాల్‌టెక్నిక్ చదువుతోంది. ధర్మపురికి ప్రత్యూష ట్రిపుల్‌ఐటీ, సౌమ్య, అర్చన బీటెక్, రాయపట్నంకు చెందిన రమ్య బీపీఈడీ, ఉత్తునూర్ రోహిత్ బీటెక్ (నిజామాబాద్), మేఘన అనస్థీషియా చదువుతున్నారు. ఈ విద్యార్థుల చదువులకు రూ.16 లక్షల వరకు చెల్లించారు.

నేడు మరో 750 మంది విద్యార్థులకు..

గణేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్మపురిలోని బాలికల ఉన్నత పాఠశాలలో పేద విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేయనున్నారు. ధర్మపురి, బుగ్గారం, బీర్‌పూర్ మండలాలకు చెందిన 750 మందికి రూ.5 లక్షల విలువైన సామగ్రి అందిస్తారు.

పేద విద్యార్థులకు అండగా..



తల్లిదండ్రులు లేని విద్యార్థులకు నా వంతు సహాయం ఎప్పుడూ అందిస్తా. ఆర్థిక ఇబ్బందులతో ఎవరూ చదువు మానేయవద్దు. పేద విద్యార్థులకు మా సంస్థ అండగా ఉంటుంది.

– గణేశ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, దత్తత సంస్థ నిర్వాహకుడు

సంస్థకు రుణపడి ఉంటా



మా అమ్మానాన్న అనారోగ్యంతో మంచం పట్టారు. ఉన్నత చదువులకు డబ్బులు లేకుంటే దత్తత సంస్థ ఆదుకుంది. నిజామాబాద్ మెడికల్ కాలేజీలో అనస్థీషియా చదువుతున్న. సంస్థకు రుణపడి ఉంటా.

– మేఘన, ధర్మపురి

రాష్ట్ర అభివృద్ధిలో బీఆర్‌ఎస్ విఫలం

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి
- కోరుట్లలో పార్టీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న లింబాద్రి

కోరుట్ల: రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి ఆరోపించారు. సోమవారం కోరుట్ల పట్టణంలో ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని సరిగా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో నిరుపేదలు, నిరుద్యోగులు, దళితులు, రైతులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలోని కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నా ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నియోజకవర్గ సమస్యలపై బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి మద్దిల నారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి గుజ్జరి ప్రకాశ్, కోల రాములు, నాయకులు ప్రభాకర్, ప్రశాంత్, శేఖర్, కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల అధ్యక్షులు శ్రీధర్, ప్రశాంత్, కిశోర్, రాందాస్, కరణ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటీకి మించి పశువుల తరలింపు

- రాయపట్నం వద్ద మూడు వ్యాన్ల పట్టివేత



పశువులను తరలిస్తున్న వ్యాన్లు

ధర్మపురి: అనుమతి లేకుండా, కెపాసిటీకి మించి పశువులను తరలిస్తున్న వ్యాన్లను పట్టుకున్నట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం నుంచి పలువురు నిజామాబాద్, చిల్వకోడూర్‌లకు సోమవారం మూడు వ్యాన్లలో ఎడ్లను తరలిస్తున్నారు. ధర్మపురి మండలంలోని రాయపట్నం జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో పరదాలు కప్పి ఉన్న వ్యాన్లు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి, పరిశీలించారు. వాటిల్లో మొత్తం 56 ఎడ్లు ఉన్నట్లు గుర్తించారు. సర్కారు నిబంధనల ప్రకారం ఒక్కో వ్యాన్‌లో 12 పశువులను మాత్రమే తరలించాల్సి ఉన్నప్పటికీ అనుమతి లేకుండా, కెపాసిటీకి మించి తీసుకెళ్తున్నారని ఎస్సై తెలిపారు. వ్యాన్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనాల యజమానులతోపాటు డ్రైవర్లపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఘనంగా జగన్నాథస్వామి రథయాత్ర

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణంలో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహించారు. భీమన్న గుడి, బస్టాండ్, గాంధీచౌక్, పటేల్ విగ్రహం, శివాజీ విగ్రహం, గుడికోట వరకు సాగిన యాత్రలో భక్తులు హరే రామ.. హరే కృష్ణ నామస్మరణ చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య పాటలు పాడుతూ నృత్యం చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి రోడ్లు శుభ్రం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.